

ఈ వైన్‌షాపులొద్దు

గ్రామ రహదారికి పక్కన, గ్రామంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు వద్దంటూ మహిళలు నిరసన తెలిపారు . - 8లో



షార్ స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో షార్ స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. - 8లో



సంతలో సందడి

తిరుపతిలోని రాయలచెరువు గేటు వద్ద ఉన్న సంతలో సందడి నెలకొంది. పొట్టేళ్లు, మేకపోతులతో కిక్కిరిసి పోయింది. - 8లో

న్యూస్‌రీల్

27వ రోజుకు చేరిన జూడాల నిరసన



సమ్మెను కొనసాగిస్తున్న వెటర్నరీ జూడాలు

తిరుపతి సిటీ: గౌరవవేతనం పెంచాలంటూ ఎస్వీ వెటర్నరీ వర్సిటీ జూడాలు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమ ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా అధికారులు వ్యవహరించడం దారుణమన్నారు. రూ.7 వేల స్టైఫండ్‌తో నెలవారి ఖర్చులు ఎలా గడపాలో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. గౌరవవేతనం పెంచే వరకు తాము సమ్మెను విరమించేది లేదని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీని తనిఖీ చేసిన కలెక్టర్



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

తిరుపతి రూరల్: పింఛన్ల పంపిణీని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తిరుపతి రూరల్ మండలం, వేదాంతపురం గ్రామానికి చేరుకున్న ఆయన పంఛన్లు పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తున్నారా..? లేదా..? అని పరిశీలించారు. అనంతరం పలువురు లబ్ధిదారులతో మాట్లాడారు. తర్వాత మీడియాతో మాట్లాడుతూ మార్చి నెలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 2,62,461 మంది పింఛన్లకు రూ.112.06 కోట్లు మంజూరైందని తెలిపారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

పని చేసినా పస్తులే!

కూటమి నేతలు హంగు, ఆర్భాటాలకు పోయి ఉపాధి కూలీలను కష్టాల్లోకి నెట్టేశారు. పల్లెపండుగ పేరుతో ఇష్టారాజ్యంగా భోంచేశారు. సీసీ రోడ్లు, డ్రైన్లు అంటూ హంగామా సృష్టించారు. ఆపై ఉపాధి కూలీలకు నిధులు లేకుండా మింగేశారు. రెండు నెలలుగా పనిచేస్తున్నా ఉపాధి డబ్బులు రాక కూలీలు అర్ధాకలితో అలమటిస్తున్నారు. దీనిపై అధికారులు సైతం నోరు మెదపకపోవడం విమర్శలకు తావిస్తోంది.

రెండు నెలలుగా అందని ఉపాధి బిల్లులు

- అష్టకష్టాలు పడుతున్న పేదలు
- అర్ధాకలితో అలమటిస్తున్న కూలీలు

చిల్లకూరు: ఉపాధి కూలీలు పస్తులతో కాలం గడపాల్సి వస్తోంది. రెండు నెలలుగా కూలీలు అందకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నారు. ఏ రోజుకు ఆ రోజు కూలికి వెళ్లి పొట్ట పోసుకునే వారికి ఇబ్బందికరంగా మారింది. కొంతమంది అప్పులు చేసి పొట్టపోసుకుంటుండగా మరికొందరు అర్ధాకలితో అలమటిస్తున్నట్టు తెలుస్తోంది.

రోజుకు రూ.60 లక్షలు

జిల్లాలో రోజుకు 30 వేల మంది వరకు కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ లెక్కన రోజుకు రూ.200 చొప్పున ఒక రోజుకు కనీసం రూ.60 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. ఒక్కో కూలీకి రెండు నెలలకు కలిపి రూ.12 వేల వరకు కూలీలు రావాల్సి ఉంది.

జిల్లా సమాచారం

మండలాలు	33
పంచాయతీలు	806
జాబ్ కార్డులు	2.68 లక్షలు
వాస్తవ కూలీల సంఖ్య	4.62 లక్షలు
యాక్టివ్ జాబ్ కార్డులు	2.25 లక్షలు
ప్రస్తుతం ఒక రోజుకు హాజరవుతున్న కూలీల సంఖ్య	42 వేల మంది

నిధుల విడుదలలో జాప్యం ఎందుకో?

కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపట్టే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు విడుదల చేయాల్సి ఉంది. అయితే ఈ నిధులను కూటమి ప్రభుత్వం కొత్తగా పల్లె పండుగ పేరుతో ఆర్భాటం చేసింది. తమ నాయకులకు కట్టబెట్టేలా ప్రణాళిక సిద్ధం చేసి ఖర్చుచేసింది. సీసీ రోడ్లు, డ్రైన్‌లు అంటూ హంగామా సృష్టించింది. అలాగే కొత్తగా ఇంకుడు గుంతలను నిర్మించేందుకు తమ నాయకులకు పనులు అప్పగించింది. దీంతో ఈ నిధులు దుర్వినియోగమవడంతో కూలీలు కడుపు మాడ్చుకోవాల్సి వస్తోంది.

పైసా ఇవ్వలేదు



“ నేను ఉపాధి పనులకు వెళ్లి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. గతంలో వారానికి ఓ సారి డబ్బు పడేది. ఇప్పుడు రెండు నెలలుగా కూలీలు ఇవ్వలేదు. కుటుంబం గడవడం కష్టంగా ఉంది. ఉపాధి పనులు ముగించేసి వ్యవసాయ పనులకు వెళ్దామంటే అవి కూడా లేవు. పిల్లల్ని ఎలా పోషించాలో తెలియడం లేదు.

– కుమార్, చిట్టమూరు, ఉపాధి కూలీ

మార్చి నెలాఖరులోగా చెల్లిస్తాం

ఉపాధి హామీ పథకంలో పనికి వచ్చే ప్రతి కూలీకి మార్చి నెలాఖరులోగా నగదు చెల్లిస్తాం. గత రెండు నెలలుగా కూలీలకు నగదు చెల్లింపులు జరగలేదు. దీనిపై ఉన్నతాధికారులకు విన్నవించాం. వెంటనే నిధులు విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు.

– వరప్రసాద్, ఏపీడీ, డ్వామా, గూడూరు

కమనీయం..
ఆదిదంపతుల కల్యాణం

- తరలివచ్చిన భక్తులు
- ఒక్కటైన జంటలు



స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాల సమర్పణ



తాళి చూపుతున్న వేదపండితులు



పూజలు చేస్తున్న అర్చక స్వాములు

శ్రీకాళహస్తి: ఆదిదంపతుల కల్యాణం భక్తుల కోలాహలం మధ్య కమనీయంగా సాగింది. శనివారం తెల్లవారు జామున సుమారు 4.30గంటల సమయంలో జ్ఞానప్రసూనాంబదేవికి శ్రీకాళహస్తీశ్వరునిచే మాంగల్యధారణ జరిగింది. ఇదే శుభఘడియల్లో ఆదిదంపతుల సమక్షంలో 41 నూతన జంటలు వివాహం చేసుకుని ఒక్కటయ్యారు. అంతకు ముందు శుక్రవారం రాత్రి ఆలయంలోని అలంకార మండపంలో శ్రీకాళహస్తీశ్వరస్వామి, జ్ఞానప్రసూనాంబ అమ్మవారిని బంగారు ఆభరణాలతో అలంకరించి వేదోక్తంగా పూజలు చేశారు. అనంతరం స్వామివారిని గజ వాహనంపై, అమ్మవారిని సింహ వాహనంపై అదిష్టింపజేసి పెండ్లిమండపం వద్దకు వేంచేశారు. పెండ్లి మండపం వద్దకు మొదట పరమేశ్వరుడు చేరుకోగా.. మధ్యలో పార్వతీదేవి అలకబూనడంతో చండికేశ్వరుడు మధ్యవర్తిత్వం చేయడంతో జ్ఞానప్రసూనాంబ అమ్మవారు సంతృప్తి చెంది పెండ్లి మండపం వద్దకు చేరుకున్నారు. అనంతరం వేదపండితులు ఆదిదంపతుల కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దంపతులు, ఈవో బాపిరెడ్డి పాల్గొన్నారు.

ఒక్కటైన 41 నూతన జంటలు

స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం సందర్భంగా 41 నూతన జంటలు ఏకమయ్యాయి. నూతన వధూవరులకు ముక్కంటి ఆలయం తరఫున మంగళసూత్రాలు, పసుపు, కుంకుమ, గాజులు, దుస్తులు అందజేశారు. జ్ఞానప్రసూనాంబ దేవికి మాంగల్యధారణ చేసిన సమయంలోనే ఈ జంటలు కూడా మాంగల్యధారణ కార్యక్రమాన్ని పూర్తిచేసి ఒక్కటయ్యారు.

గిరిప్రదక్షిణకు హాజరు కండి

కైలాస గిరి ప్రదక్షిణ ఎన్నో జన్మల పుణ్యఫలమని ఉభయకర్త, శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జరగనున్న స్వామి, అమ్మవార్ల గిరిప్రదక్షిణకు శివయ్య భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

రుద్రాక్ష చప్పరాలపై శివయ్య వైభవం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి వార్షికోత్సవాలను పురస్కరించుకుని శనివారం ఉదయం జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి రుద్రాక్ష చప్పరాపై పురవీధుల్లో ఊరేగారు. ఆదిదంపతుల కల్యాణం ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులను ఆలయానికి తీసుకెళ్లారు. ఉదయం 11గంటల సమయంలో వేదోక్తంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను రుద్రాక్ష చప్పరాలపై అధిష్టింపేజేసి పురవీధుల్లో ఊరేగించారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు : కైలాసగిరి ప్రదక్షిణ వాహన సేవలు
ఉదయం: బనాత అంబారి వాహనసేవ
సాయంత్రం: అశ్వం – సింహ వాహన సేవ
ఉభయదాతలు: బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం శ్రీవాణిరెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి (శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు)

ఆగమోక్తం నటరాజస్వామి కల్యాణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం రాత్రి సభాపతి కల్యాణం ఆగమోక్తంగా సాగింది. నటరాజ స్వామి, శివకామ సుందరి వివాహాన్ని పురోహితులు వేదోక్తంగా నిర్వహించారు. అనంతరం శివకామసుందరి సమేత నటరాజస్వామి పురవీధుల్లో ఊరేగారు.



సభాపతి కల్యాణంలో అర్చకులు

ఖాకీ పోస్టింగ్‌లకు..
ఖద్దరు బేరం!



ఇప్పటికీ పోలీసుల బదిలీలపై స్పష్టత కరువు

- ప్రజాప్రతినిధుల లెటర్ ఉంటే పోస్టింగ్
- బేరసారాలు సాగిస్తున్న నేతలు
- కీలకమైన పోలీస్ స్టేషన్‌కు రూ.20 లక్షలకు పైగా డిమాండ్
- ఆదాయవనరులున్న స్టేషన్లకు పోటాపోటీ

తిరుపతి క్రైమ్: కూటమి ప్రభుత్వంఏర్పడి సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నా డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు తమకు అనుకూలమైన స్థానాల కోసం ప్రజాప్రతినిధు ల చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే ఉన్నారు. తిరుపతిలో ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్లలో బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల ఇప్పటికీ పలు పోస్టింగులు అటాచ్‌మెంట్ పైన నడుస్తున్నాయి. జిల్లా పరిధిలోనే అత్యంత కీలకమైన పోలీస్ స్టేషన్ అయిన ఈస్ట్ పోలీస్ స్టేషన్ కూడా అటాచ్‌మెంట్ మీద నడుస్తోంది. ఇక్కడ పని చేస్తున్న సీఐని గత ఎస్పీ సుబ్బరాయుడు హయాంలో బదిలీ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఈ పోలీస్ స్టేషన్‌ను వెస్ట్ సీఐకి అటాచ్‌మెంట్ చేస్తూ ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. కొద్దిరోజుల అనంతరం వెస్ట్ పోలీస్ స్టేషన్‌కు మరో సీఐని అటాచ్‌మెంట్ ఇస్తూ అప్పటి ఎస్పీ మరోసారి ఆదేశాలు జారీచేశారు. అప్పటి నుంచి ఈ పోలీస్ స్టేషన్ అటాచ్‌మెంట్ పైనే నడుస్తోంది. పోలీస్ స్టేషన్లో పైరవీలు చేసేందుకు పలువురు అధికారులు ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కాసులిస్తే కాస్ట్లీ పోలీస్ స్టేషన్!

తిరుపతిలోని ఓ ప్రజాప్రతినిధి పెద్ద మొత్తంలో కాసులు తీసుకొని ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు కొందరు పోలీస్ అధికారులను కేటాయిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఆ ప్రజాప్రతినిధి పీఏ చేతికి రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల దాకా చేతులు మారినట్లుగా తెలుస్తోంది. గతంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఒక పోలీస్ స్టేషన్లో పనిచేసిన సీఐ ఈ మొత్తం నగదును చెల్లించి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు వస్తున్నట్టు చర్చ మొదలైంది. అదేవిధంగా తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్‌లో కూడా ఇదే ప్రజాప్రతినిధి మరో అధికారికి విక్రయించినట్లు సమాచారం. వీరందరికీ త్వరలోనే డ్యూటీ ఆర్డర్ కూడా ఇస్తారని చర్చించుకుంటున్నాయి.

- తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు కూడా పలువు రు ఐపీఎస్ స్థాయి అధికారులు ఇద్దరు సీఐల పేర్లు ప్రతిపాదించినట్లు తెలిసింది. గతంలో అన్నమయ్య జిల్లాలో పనిచేసిన ఓ ఎస్పీ అక్కడ స్పెషల్ బ్రాంచ్‌లో సీఐగా పనిచేసిన వ్యక్తిని తిరుమలకు తీసుకొ స్తానని మాటిచ్చినట్టు సమాచారం. అదే పోలీస్‌స్టేషన్‌కు మరో ఐపీఎస్ అధికారి ఇంకో సీఐకి పోస్టింగ్ ఇప్పిస్తానని మాటిచ్చినట్టు సమాచారం. ప్రస్తు తం ఇదే స్థానంలో పనిచేస్తున్న సీఐకి రిటైర్డ్ ఐపీఎస్ అధికారుల ఆశీస్సులు ఉండడం గమనార్హం.

గతంలో పనితీరును బట్టి పోస్టింగ్‌లు

గతంలో పనితీరుని బట్టి పోస్టింగ్ వచ్చేవారు. కేసుల పరిష్కార వైనం, రివార్డులు, అవార్డులు, చార్జీ మెమోలు, ఇలా అన్నిటినీ పరిశీలించేవారు. అయితే ప్రస్తుతం స్థానిక ప్రజాప్రతినిధి సిఫారసు, సామాజిక సమీకరణకే ప్రాధాన్యత ఇస్తూ బదిలీలు చేస్తున్నారు. అంతేకాకుండా కీలకమైన పోలీస్ స్టేషన్లు కోరేవారికి అది ఎంత మొత్తంలో నగదు చెల్లిస్తే అంత మంచి పోలీస్ స్టేషన్‌కు పోస్టింగ్ ఇచ్చే విధంగా ప్రస్తుత పాలన సాగుతుంది. ఆ తర్వాత ఆ డబ్బంతా ఫిర్యాదుదారుల వద్ద నుంచి వసూలు చేస్తారని బహిరంగ రహస్యం. ఇప్పటికే చాలా పోలీస్ స్టేషన్లలో చిన్నపాటి కేసు నమోదు చేయాలన్నా కూడా కాసులు చెల్లించాల్సి వస్తోంది.

జిల్లాకు మరో 50 విద్యుత్ బస్సులు



ఆర్టీసీ అధికారులతో సమీక్షిస్తున్న ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిమ్మాడి చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: బస్సుల కండీషన్‌కు తొలి ప్రాధాన్యత ఇస్తామని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) తిమ్మాడి చెంగల్‌రెడ్డి తెలిపారు. శనివారం విజయవాడ నుంచి విచ్చేసిన ఆయన తిరుపతిలోని డీపీటీఓ కార్యాలయంలో డిపో మేనేజర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమలతో పాటు అన్ని ప్రాంతాల్లో ప్రమాదాలకు తావులేకుండా ఆర్టీసీ సర్వీసుల కండీషన్‌పై ప్రతి డీఎం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మరోవైపు రాష్ట్రంలో 750 విద్యుత్ సర్వీసులు కొత్తవి రానున్నాయని వెల్లడించారు. అందులో తిరుపతికి 50 సర్వీసులు కేటాయిస్తామన్నారు. మంగళం డిపో కేంద్రంగా కొత్తగా వచ్చే విద్యుత్ బస్సుల ఆపరేటింగ్ ఉంటుందని వివరించారు. మరోవైపు జిల్లాలో 11 ఆర్టీసీ డిపోల పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డీపీటీఓ నరసింహులు, పీఓ సహజాన్, ఏటీఎం డీఆర్ నాయుడు పాల్గొన్నారు.



కాలు విరగడంతో ఆటో సహాయంతో ఎస్వీ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థి

మెరుపై సాగరా..
ఈ గెలుపే నీదిరా!

ప్రశాంతంగా ఇంటర్ పబ్లిక్ పరీక్షలు

- తొలి రోజు 820 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సర పబ్లిక్ పరీక్షలు శనివారం తిరుపతి జిల్లా వ్యాప్తంగా 86 పరీక్ష కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–1 పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు జనరల్‌లో 31,851 మంది, ఒకేషనల్‌లో 1,313 మంది మొత్తం 33,164 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో జనరల్‌లో 720 మంది, ఒకేషనల్‌లో 100 మంది, మొత్తం 820 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డెఫ్ అండ్ డంబ్ విద్యార్థులు సహాయకుల సహకారంతో పరీక్షను రాసినట్లు వెల్లడించారు. సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 86 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు సెకండ్ లాంగ్వేజ్ పేపర్–2 పరీక్ష జరగనుంది.

పటిష్టంగా ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పరీక్ష నిర్వహణాధికారులను ఆదేశించారు. తిరుపతి రూరల్, వేదాంతపురం పంచాయతీ పరిధిలోని శ్రీనివాస జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ఏర్పాటుచేసిన సీసీ కెమరాల పర్యవేక్షణలో పరీక్షలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా సీసీ కెమెరాలను అమరావతిలోని ఇంటర్ బోర్డుకు అనుసంధానించడంతో ఎటువంటి అవకతవకలకు ఆస్కారం ఉండదని పేర్కొన్నారు.



తిరుపతిలోని ఎమరాల్డ్ పరీక్ష కేంద్రం వద్ద గుమికూడిన విద్యార్థులు, తల్లిదండ్రులు



వేదాంతపురంలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్


రాక్‌మెన్ పరిశ్రమ పరిశీలన



కంపెనీని పరిశీలిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలం, పంగూరు సమీపంలోని రాక్‌మెన్ కంపెనీలో ఈనెల 3వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హైడ్రోజన్ ప్లాంట్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. ప్లాంట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యానికి కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. అడిషనల్ ఎస్పీ రవిమనోహరాచారి, రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు, ఏర్పేడు సీఐ ఎస్.జయచంద్ర పాల్గొన్నారు.

సూర్యుడిపై పరిశోధనలు



ఆదిత్య ఎల్1 ఉపగ్రహం ద్వారా సూర్యునిపై ఛాయా చిత్రాలు తీసిన పీఎస్ఎల్‌వీ సీ-57 రాకెట్

సూళ్లూరుపేట: ఇస్రో 2023 సెప్టెంబర్ 2న పీఎస్ఎల్‌వీ సీ57 రాకెట్ ద్వారా ప్రయోగించిన ఆదిత్య ఎల్1 ఉపగ్రహం సూర్యునిపై పరిశోధనలు చేస్తూ అత్యంత విలువైన సమాచారాన్ని సేకరిస్తోందని ఇస్రో తన వెబ్‌సైట్ ద్వారా శుక్రవారం ప్రకటించింది. భారతదేశానికి మొట్టమొదటి సౌర ఆధారిత మిషన్ ఆదిత్య ఎల్1 కావడం విశేషం. ఆదిత్య ఎల్1లో అమర్చిన పేలోడ్స్ ఒక సంచలనాత్మక పరిశోధనలు చేసిందని తెలియజేశారు. నియర్ అల్ట్రా వయొలెట్ బ్యాండ్ (ఎన్‌యూవీ) దిగువ సౌరవాతావరణంలో ఫోటోస్పియర్, క్రోమోస్పియర్‌లో సౌర మంట 'కెర్నల్' మొట్టమొదటి ఛాయాచిత్రాన్ని చిత్రీకరించినట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

96.49 శాతం పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: జిల్లాలో శనివారం 96.49 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీలో తిరుపతి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. 96.06 శాతం పింఛన్లు పంపిణీ చేసి అన్నమయ్య జిల్లా రెండోస్థానంలో నిలిచిందని తెలిపారు. తిరుపతి జిల్లాలో 2,62,461 పింఛన్లకు గాను తొలిరోజు 2,53,240 మందికి పంపిణీ చేసినట్టు వివరించారు. మిగిలిన వారికి సోమవారం పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు.

నీటి గుంతలో పడి లారీ డ్రైవర్ మృతి


మృతి చెందిన దిలీప్ కుమార్

తడ: నీటి గుంతలో పడి లారీ డ్రైవర్ మృతిచెందిన ఘటన శుక్రవారం మాంబట్టు సెజ్‌లోని టాటా స్టీల్ పరిశ్రమ వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొండపనాయుడు కథనం.. జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ దిలీప్ కుమార్ యాదవ్(32) లోడింగ్ కోసం శుక్రవారం టాటా స్టీల్ పరిశ్రమ వద్దకు వచ్చాడు. సాయంత్రం స్నానం చేసేందుకు పరిశ్రమ ఎదుట ఉన్న గుంతలోకి దిగి మునిగి పోయాడు. సమీపంలో ఉన్న తోటి లారీ సిబ్బంది గమనించి పరిశ్రమ యాజమాన్యానికి తెలపడంతో వాళ్లు సూళ్లూరుపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది గాలింపు చేపట్టి మృత దేహాన్ని వెలికి తీసి సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

లోడ్డు క్రమబద్ధీకరణకు రాయితీ


కె.సంతోషరావు

తిరుపతి రూరల్: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(ఏపీఎస్పీడీసీఎల్) పరిధిలో గృహ విద్యుత్ ఆదనపు లోడ్డు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ కల్పిస్తామని ఆ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులు తాము వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడ్డు క్రమబద్ధీకరణకు 2025 మార్చి 1వ తేదీ నుంచి జూన్ 30వ తేదీలోగా స్వచ్ఛందంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ మేరకు వినియోగదారులు చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం వరకు రాయితీ కల్పిస్తామని చెప్పారు.

తిరుమలను నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలి

– కేంద్ర మంత్రికి టీటీడీ చైర్మన్ లేఖ

తిరుమల: తిరుమల పుణ్యక్షేత్రంపై విమానాలు ఎగరకుండా నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు లేఖ రాశారు. తిరుమల కొండపై తక్కువ ఎత్తులో ఎగిరే విమానాలు, హెలికాప్టర్లు, ఇతర వైమానిక కార్యాకలాపాలతో శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న పవిత్రమైన వాతావరణానికి భంగం కలుగుతోందని తెలియజేశారు.

శ్రీవారి ఆలయంలో బాలాలయం

అలిపిరి పాదాల మండపంలోని శ్రీవారి ఆలయంలో బాలాలయం కారణంగా శనివారం నుంచి 17వ తేదీ వరకు శ్రీవారి దర్శనం అందుబాటులో ఉండదని సంబంధిత అధికారులు పేర్కొన్నారు.

మద్యం షాపు ఏర్పాటుపై
మహిళల నిరసన


బుచ్చినాయుడుకండ్రిగ మండలం, చల్లమాంబపురంలో నిరసన తెలుపుతున్న మహిళలు


తిరుపతి రూరల్‌లో నిరసన తెలుపుతున్న స్థానికులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో నిబంధనలకు విరుద్ధంగా చల్లమాంబపురం గ్రామంలో మద్యం షాపును ఏర్పాటు చేయడంపై శనివారం మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ఇళ్లమధ్యలో మద్యం షాపును ఏర్పాటు చేయడంతో ఇబ్బందికరంగా ఉందన్నారు. గ్రామంలోని రోడ్డు పక్కనే మద్యం షాపు పెట్టడంతో నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రిళ్లు ఇళ్లల్లోకి చొరబడి గొడవ చేస్తున్నారని వాపోయారు. అధికారులు స్పందించి మద్యం షాపును వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మణినాయుడు హెచ్చరించారు.

అనధికార పర్మిట్ షాపులో విచ్చలవిడిగా మద్యం

మండలంలోని చల్లమాంబపురం గ్రామంలోని మద్యం దుకాణం పక్కనే ఉన్న అనధికార పర్మిట్ షాపులో మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మద్యం షాపు మూత వేసిన సమయంలో అనధికార పర్మిట్ షాపులో ఉదయం 5 నుంచి మద్యం విక్రయిస్తున్నారని తెలిపారు.

ఆడబిడ్డలున్నారు.. మద్యం దుకాణం పెట్టొద్దు!

తిరుపతి రూరల్: 'కాలేజీలకు వెళ్లే ఆడబిడ్డలున్నారు.. ఉదయం, సాయంత్రం వేళల్లో ఆ మార్గం గుండానే తిరుగుతుంటారు.. మద్యం మత్తులో మందుబాబులు వల్ల ఇబ్బందులు వస్తాయి.. దయచేసి ఇక్కడ మద్యం దుకాణం పెట్టకండి..' అంటూ తిరుపతి రూరల్ మండలం, లింగేశ్వరనగర్, అవిలాల గ్రామాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఆ దుకాణం వద్దకు బాలికలను తీసుకువెళ్లి దుకాణం ముందు కూర్చోబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారులు, పోలీసులు ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గతంలో చికెన్ సెంటర్‌గా ఉన్న దుకాణాన్ని మద్యం అమ్మకాల కోసం ఏర్పాట్లు చేయడంతో స్థానికులు అడ్డుకున్నారు. అయినప్పటికీ మద్యం వ్యాపారులు గుట్టుచప్పుడు కాకుండా దుకాణంలోకి మద్యం బాటిళ్లను చేర్చడంతో దుకాణం ప్రారంభిస్తే ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై సోమవారం జిల్లా కలెక్టర్‌ను కూడా కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు దుకాణ దారులకు తెలిపారు.

స్టైఫండ్ పెంచాల్సిందే


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత

తిరుపతి కల్చరల్: ఎస్వీ వెటర్నరీ విద్యార్థులకు ఇతర వైద్య కోర్సుల విద్యార్థులతో సమానంగా స్టైఫండ్ రూ.25 వేలకు పెంచాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తిరుపతిలోని గంధమనేని శివయ్య భవన్‌లో శనివారం పశు వైద్య విద్యార్థులకు స్టైఫండ్ పెంచాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నేత ఓబుల్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు శివ బాలాజీ, ఎన్ఎల్ఎస్ఏ వ్యవస్థాపకుడు సుందర్‌రాజ, బీసీ విద్యార్థి విభాగం నేత తిరుమలేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు లోకేష్, ఐక్య విద్యార్థి సంఘ నేత చంద్ర నాయక్ పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం పశువైద్య విద్యార్థుల సమస్యలను కూటమి ప్రభుత్వం గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఐక్య విద్యార్థి సంఘ నేతలు మోహన్, తేజ, బాల, పూర్ణ, విక్రమ్, రాజేఖ, చెంగల్‌రెడ్డి, వినోద్, రవి తేజ, బాలాజీ నాయక్, సురేష్ పాల్గొన్నారు.

పరీక్షా సామగ్రి పంపిణీపైనా అక్కసే

- ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు
- ఉపాధ్యాయులపై ఎమ్మెల్యే భార్య మండిపాటు

తిరుపతి టాస్క్‌ఫోర్స్: వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చంద్రగిరి నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామగ్రిని ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అందజేశారు. ఈ విషయం ఎమ్మెల్యే భార్య వరకు చేరింది. వెంటనే విద్యాశాఖ అధికారులకు ఫోన్‌చేసి '2029 వరకు ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యే నా భర్త. మీకు భక్తి ఉంటే చెవిరెడ్డి ఇంటికెళ్లి పనిచేసుకోండి.. లేదంటే చంద్రగిరి నియోజకవర్గం వదలి వెళ్లిపోండి' అంటూ విద్యాశాఖ అధికారులకు ఫోన్‌లో సీరియస్‌గా వార్నింగ్ ఇచ్చారని సమాచారం. అంతే రాత్రికి రాత్రే చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎంకు జిల్లా విద్యాశాఖాధికారి నుంచి షోకాజ్ నోటీసు వచ్చింది.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్


దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు


గాయపడిన ప్రయాణికుడు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): గుడిమల్లం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులోని ప్రయాణికులకు గాయాలైన ఘటన రేణిగుంటలో చోటుచేసుకుంది. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం.. గురువారం మధ్యాహ్నం గుడిమల్లం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు రేణిగుంట సమీపంలో వస్తుండగా పక్క నుంచి ప్రధాన రహదారి పైకి వస్తున్న టిప్పర్ ఢీకొనంది. ఈ ఘటనలో బస్సు సైడ్ దెబ్బతినగా విజయవాడకు చెందిన దిలీప్‌కు గాయాలయ్యాయి. మరికొందరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

సంతలో సందడి


తిరుపతి నగరంలోని రాయలచెరువు గేటు వద్ద శనివారం జరిగిన సంతలో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన మేకలు, పొట్టేళ్లు విక్రయించుకోవడానికి పెంపకందార్లు పోటీపడ్డారు.

– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

సీఎంకు సాదర స్వాగతం


రేణిగుంట విమానాశ్రయంలో సీఎం చంద్రబాబు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం శనివారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సాదర స్వాగతం లభించింది. అనంతరం ఆయన హెలికాప్టర్లో జీడీ నెల్లూరుకు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని తిరుగుపయనమయ్యారు. స్వాగతం పలికిన వారిలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

గుడిమల్లం ఆలయంలో హుండీ చోరీ

ఏర్పేడు(రేణిగుంట): ఏర్పేడు మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వరాలయంలో అమ్మవారి వద్ద ఉన్న హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆలయంలో ఓ పక్క శివరాత్రి ఉత్సవాలు జరుగుతున్నా.. హుండీ చోరీ కావడం విశేషం. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తి హుండీ ఎత్తుకెళ్లినట్లు గుర్తించిన ఆలయాధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వరి పంట పరిశీలన


వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలంలోని గాజులమండ్యం గ్రామ పొలాల్లో ఈ క్రాప్‌లో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేసిన పంటలను శనివారం కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ప్రతి ఒక్క రైతు తాము సాగుచేస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల సహకారంతో పంట నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు.

శ్రీనివాసా.. మళ్లీ దొంగాట!


లీజులు లేకుండా అక్రమంగా తవ్వకాలు


మళ్లీ పనులు చేస్తున్న దృశ్యం

- కాలం చెల్లిన గనిలో ముఖ్యనేత పనులు
- కన్నెత్తి చూడని అధికారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: సైదాపురానికి కూత వేటు దూరంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఓ ముఖ్యనేత కనుసన్నల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా సాగుతోంది. సరిగ్గా నాలుగు నెలలు క్రితమే స్థానిక ప్రజాప్రతినిధికి ఆ ముఖ్యనేత మధ్య చెలరేగిన వివాదం కారణంగా ఆ మైన్‌పై పోలీసు, రెవెన్యూ అధికారులు దాడులు చేశారు. పలు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత కూటమి నేతల మధ్య ఏం జరిగిందో ఏమో కానీ ఆ శ్రీనివాసా పద్మావతి గనిలో మళ్లీ అక్రమ మైనింగ్ మొదలైంది.

మళ్లీ మొదలైన అక్రమ మైనింగ్

మండల కేంద్రమైన సైదాపురానికి కూత వేటు దూరంలోనే కాలం చెల్లిన శ్రీనివాసా పద్మావతి గని ఉంది. గతంలో లీజు కాలవ్యవధి తీరిపోవడంతో గనిని అలాగే వదిలేశారు. ఈ గనిలో మైకా క్వార్ట్జ్ ఖనిజం లభ్యమవుతోంది. దీనికి డిమాండ్ ఉండడంతో నేతల కన్ను ఈ గనిపై పడింది. గత ఏడాది అక్టోబర్‌లో ఆ గనిలో అక్రమంగా మైనింగ్ కార్యకలాపాలు సాగిస్తుండడంతో స్థానిక ప్రజాప్రతినిధి అనుచరులు అధికారులచేత తనిఖీలు చేయించి అందులో పనిచేస్తున్న విలువైన యంత్రాలను సీజ్ చేయించారు. కాని ఏమైందో ఏమో కాని శనివారం నుంచి ఆ గనిలో అనుమతులు లేకుండానే మళ్లీ పనులు మొదలుపెట్టారు.

దొంగ అరెస్టు

– రూ.12 లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం


నిందితుడి వద్ద నుంచి రికవరీ చేసిన బంగారు నగలు


నిందితుడిని హాజరుపరిచి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్: నేర ప్రవృత్తికి అలవాటు పడి ఇంటి ముందు ముగ్గులు వేసే మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసుకుని దొంగతాలకు పాల్పడుతున్న నిందితుడు కావాలి భవానీశంకర్‌ను పోలీసులు చాకచాక్యంగా పట్టుకున్నట్లు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.12 లక్షల విలువ గల 170 గ్రాములు బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టణంలోని పోలీస్ డివిజన్ కార్యాలయంలో శనివారం డీఎస్పీ ఆ వివరాలను వెల్లడించారు. నాయుడుపేట ప్రాంతంలో తరచూ బంగారు గొలుసులు చోరీలు జరుగుతుండడంపై నాయుడుపేట సీఐ బాబి, ఎస్ఐ ఆదిలక్ష్మి, ఐడీ పార్టీ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో శనివారం పట్టణ పరిధిలోని మల్లాం జాతీయ రహదారి కూడలి వద్ద అనుమానాస్పదంగా నిలుచుకుని ఉన్న భవానీశంకర్‌ను పట్టుకున్నట్లు వివరించారు. విచారణలో అసలు విషయం బయటపడింది. నిందితుడు నాయుడుపేట పట్టణంలోని పాగొట్టం కాలనీ కాలవగట్టు ప్రాంతానికి చెందిన వాడుగా గుర్తించారు. ఇతడిపై 2021 నుంచి 2025 వరకు 8 కేసులు ఉన్నట్టు డీఎస్పీ వివరించారు. నిందితుడి వద్ద నుంచి 8 బంగారు చైన్‌లు, 1 బంగారు నల్లపూసల దండ మొత్తం 170 గ్రాముల బంగారు నగలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ.12 లక్షలకు పైగా ఉంటుందన్నారు. నిందితుడిని పట్టుకున్న సీఐ, ఎస్‌లతో పాటు హెడ్‌కానిస్టేబుల్ కోండూరు రామ్మోహన్‌రాజు, కానిస్టేబుల్ అన్నదయాకర్, షేక్ సుహెల్‌బాబు, డీ.పోలయ్యలకు నగదు రివార్డులను అందించారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మృతి


మృతి చెందిన జగన్‌మోహన్ ఆచార్యులు

సత్యవేడు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జగన్‌మోహన్ ఆచార్యులు (56) శుక్రవారం రాత్రి గుండె నొప్పితో మృతి చెందారు. వైఎస్సార్ జిల్లా, ప్రొద్దుటూరుకు చెందిన ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమార్తె అమెరికాలో, కుమారుడు, భార్య హైదరాబాద్‌లో ఉంటున్నారు. చౌడేపల్లి జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తూ గత ఏడాది పదోన్నతిపై సత్యవేడు జూనియర్ కళాశాలకు వచ్చారు. ఇప్పటికే బైపాస్ సర్జరీ చేసుకొని వైద్యం పొందుతున్నారు. కళాశాల వద్దే ఉన్న ఆయన శుక్రవారం రాత్రి 10 గంటలకు ఇంటర్ కళాశాల గదులు పరిశీలిస్తూ వెలుపలకు వచ్చి అక్కడే సొమ్మసిల్లిపడిపోయారు. వెంటనే ఓ ప్రవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. తెల్లవారితే ఇంటర్ పరీక్షకు డిపార్టుమెంట్ ఆఫీసర్ డ్యూటీ చేయాల్సిన ఆయన మృతి చెందడంతో జాకీర్ హుసేన్(నాగలాపురం జూనియర్ కళాశాల)ను నియమించి ఇంటర్ పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ మృతి పట్ల ఎంఈఓలు కే.రవి, ఉషా, లెక్చరర్లు, విద్యార్థులు తమ ప్రగాఢ సంతాపం తెలిపారు.

శ్రీసిటీలో షార్ స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్


శ్రీసిటీలో మొబైల్ సాంకేతిక ప్రదర్శన బస్సు

శ్రీసిటీ (వరదయ్యపాళెం): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో షార్ స్పేస్ ఆన్ వీల్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన ఆకట్టుకుంది. శ్రీసిటీ, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను శుక్ర, శనివారాల్లో సాగింది. ట్రిపుల్ ఐటీ, క్రియా విశ్వవిద్యాలయం, అకార్డ్, చిన్మయ విద్యాలయ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శనలో భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ ప్రయోగ వాహనం నుంచి తాజా పురోగతి వరకు వివిధ ప్రయోగాలు, లాంచ్ ప్యాడ్‌లు, చంద్రయాన్, మంగళయాన్, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్లు తదితర నమూనాలను ప్రదర్శించారు. సంక్లిష్టమైన అంతరిక్ష సాంకేతికతను వివరించడంతో పాటు సైన్స్ సాంకేతికత పట్ల ఆసక్తిని పెంచే రీతిలో విద్యార్థులకు ఈ అవకాశాన్ని కల్పించిన షార్ డైరెక్టర్ రాజరాజన్‌కు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.